క్లుప్తంగా

నేడు భట్టిప్రోలులో సెమీ క్రిస్మస్

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఎస్సీ కాలనీలోని చర్చిలో సెమీ క్రిస్మస్ ఆరాధన నిర్వహిస్తున్నట్లు కమిటీ అధ్యక్షుడు పాస్టర్ వి.ఆనందరావు, సెక్రటరీ పాస్టర్ జయరావులు బుధవారం తెలిపారు. క్రిస్మస్ కానుకగా మండలంలోని 80 మంది దైవ సేవకులకు ప్రత్యక్షత మినిస్ట్రీస్ అధినేత ఎస్.గిరిబాబు నూతన వస్త్రాలు అందచేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ప్రేమ విందు ఉంటుందని పేర్కొన్నారు.

విద్యార్థులకు క్రీడాదుస్తులు అందజేత



చుండూరు(భట్టిప్రోలు): చుండూరు మండలం యడ్లపల్లి ఆలపాటి వెంట్రామయ్య జిల్లా పరిషత్ హైస్కూల్‌కి చెందిన 20 మంది క్రీడా కారిణులకు బుధవారం క్రీడాదుస్తులు అందజేశారు. దివంగత దావూరి యశోద జ్ఞాపకార్థం ప్రథమ వర్ధంతి పురస్కరించుకుని ఆమె తల్లి మారుపూడి సుశీల రూ. 10 వేలు వ్యయం చేసే ఈ దుస్తులు పంపిణీ చేశారు. హైస్కూల్ విద్యార్థులు జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి అథ్లెటిక్స్‌లో ప్రతిభ చూపడంతో ఈ ప్రోత్సాహకాన్ని అందిస్తున్నట్లు సుశీల తెలిపారు. సుశీలను హైస్కూల్ హెచ్ఎం కుర్రా శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ వేమూరి శరత్‌బాబు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఇమామ్ హుస్సేన్‌కు అభినందనలు



అమృతలూరు(భట్టిప్రోలు): వేమూరు నియోజకవర్గం అమృతలూరుకు చెందిన బాపట్ల జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ షేక్ ఇమామ్ హుస్సేన్ ఏపీ ప్రభుత్వ రాజకీయ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. మంగళవారం తాడేపల్లి వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో అవార్డుల కార్యక్రమం నిర్వహించారు. ఇమామ్ హుస్సేన్ ఉమ్మడి గుంటూరు జిల్లాలో 350 మసీదుల్లో హర్ దిల్‌మే వైఎస్సార్-హమ్ సబ్ జగన్‌కే సాత్ కార్యక్రమం పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సజ్జల రామకృష్ణారెడ్డి ఇమామ్ హుస్సేన్‌ను అభినందిస్తూ ప్రశంసా పత్రం అందచేశారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా అరవింద



భట్టిప్రోలు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశానుసారం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా బ్రాహ్మణ సామాజిక వర్గం నుంచి బాపట్ల జిల్లా భట్టిప్రోలుకు చెందిన ఘూలి అరవిందను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. అరవింద ఇప్పటివరకు పార్టీ రాష్ట్ర మహిళా కార్యదర్శిగా పని చేశారు. అదేవిధంగా ఈమె గతంలో ఐఎన్‌టీయూసీ ట్రేడ్ యూనియన్ , కాంగ్రెస్ పార్టీ హయాంలో ఉభయ తెలుగు రాష్ట్ర మహిళా కార్యదర్శిగా వ్యవహరించారు. అంతేకాకుండా సామాజిక స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహిస్తూ మహిళా హక్కుల కోసం నిరంతరం పోరాడుతూ ప్రజలతో మమేకమయ్యేవారు. వైఎస్సార్ సీపీ పురోభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఆమె బుధవారం తెలిపారు.

విద్యార్థులకు కళ్లజోళ్లు పంపిణీ



వెల్లటూరు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం వెల్లటూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా దృష్టి లోపాలు ఉన్న 26 మంది విద్యార్థులకు కళ్లజోళ్లను పంపిణీ చేశారు. ఇటీవల హైస్కూల్‌లో ఈ పథకం కింద ఆప్తమాలజిస్ట్ అరుణరాణి విద్యార్థులందరికీ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో 26 మంది విద్యార్థులకు దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించారు. వీరికి ప్రభుత్వం నుంచి కళ్లజోళ్లు రాగా వాటిని బుధవారం విద్యార్థులకు అందచేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం రెడ్డి సుధాకర్ ఉపాధ్యాయులు కె. శివరామకృష్ణ, కె.కుటుంబరావు, , ఆశా కార్యకర్తలు వి. వెంకటేశ్వరమ్మ, జె.సుజాత తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

ఫిరంగిపురం: సమస్యలు పరిష్కరించాలని కోరుతూఅంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు బుధవారం సమ్మె నిర్వహించారు. యూనియన్ మండల ప్రాజెక్ట్ అధ్యక్షురాలు కె.విజయ మాట్లాడుతూ సమస్యలు ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలని కోరారు.

రాష్ట్రంలో సంక్షేమ స్వరాజ్యం

- సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే జగన్ మళ్లీ సీఎం కావాలి
- ఎమ్మెల్యే కోన రఘుపతి
- పేరలిలో 'వై ఏపీ నీడ్స్ జగన్'



పేరలి సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

పేరలి(కర్లపాలెం): రాష్ట్రంలో కులమతాలకు రాజకీయాలకు అతీతంగా అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మళ్లీ మన రాష్ట్రానికి సీఎంను చేసుకోవాలని ఎమ్మెల్యే కోన రఘుపతి చెప్పారు. బుధవారం పేరలి గ్రామ సచివాలయం వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కోన రఘుపతి ముందుగా గ్రామంలోని మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేశారు. తరువాత గ్రామ సచివాలయానికి వెళ్లి వెల్‌ఫేర్ బోర్డును ఆవిష్కరించి అక్కడ జరిగిన సభలో ఆయన మాట్లాడారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు డ్వాక్రా రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి అమలు చేయకుండా మహిళలను మోసం చేశాడని కోన మండిపడ్డాడు. సీఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు నాలుగు దఫాలుగా రుణమాఫీ పథకాన్ని అమలు చేస్తున్నారని కోన గుర్తుచేశారు. రాష్ట్రంలో జగన్ అమలు చేస్తున్న ఉచిత పథకాలతో రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలోకి వెళ్ళిపోయిందని గగ్గోలుపెట్టిన చంద్రబాబు ఇప్పుడు ఎన్నికల దగ్గరకు వస్తున్న సమయంలో తమ ప్రభుత్వం కంటే అధికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తామని చెప్పటం హాస్యాస్పదంగా ఉందన్నారు. గ్రామ సర్పంచ్ మల్లెల వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ కర్లపాలెం మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, వైస్ ఎంపీపీలు కాగిత బుల్లియ్య, పందరబోయిన సుబ్బారావు, నాయకులు అక్కల శ్రీనివాసరెడ్డి, ఎస్కే ఆసిఫ్ అలీ, రాతంశెట్టి లక్ష్మణరావు, కంకిపాటి నాగరాజు, ధర్మేంద్ర, గొర్రుముచ్చు మీరయ్య డ్వాక్రా మహిళలు తదితరులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధి జగనన్నతోనే సాధ్యం..

బాపట్ల: రాష్ట్రంలో గ్రామాలాభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. మండలంలోని పూండ్ల గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. గ్రామంలో భారీగా ఈకార్యక్రమానికి తరలివచ్చారు. గ్రామంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన బోర్డును ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ అమ్మఒడి, రైతుభరోసా, పెన్షన్ పెంపుదల, అర్హతే ఆధారంగా వృత్తిదారులకు ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును పరిశీలించాలని కోన సూచించారు. ప్రతి ఇంటికీ ఏవిధంగా సంక్షేమం అందించాలి, ఆ గ్రామంలో ఎటువంటి అభివృద్ధి చేస్తే ప్రజలు సంతృప్తికరంగా ఉంటారనేది అనునిత్యం ఆలోచన చేసి ప్రభుత్వ అధికారులను సైతం గ్రామాలకు పంపుతున్న ఏకైక నాయకుడు మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని పేర్కొన్నారు. విద్య కేంద్రంగా ఉన్న బాపట్లలో వైద్యసదుపాయాలు సక్రమంగా లేకపోవటంతో వైద్యశాలను అడగటం జరిగిందని కోన చెప్పారు. వైద్యకళాశాల కాదని, ఏకంగా మెడికల్ కళాశాలనే ఇచ్చి ఈప్రాంతాభివృద్ధికి ప్రముఖ పాత్ర పోషించారని గుర్తు చేశారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి శాశ్వత ఇళ్ళు ఉండాలనే సంకల్పంతో ప్రతి గ్రామ, పట్టణ ప్రాంతంలో కొత్త ఊళ్లు, వార్డులను సృష్టించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే తీసుకొచ్చే బాధ్యత మన అందరిపై ఉందన్నారు. భావి తరాలకు ఉజ్వల భవిష్యత్ జగనన్నతోనే సాధ్యమని కోన వివరించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు కోకి రాఘవరెడ్డి, నాయకులు గింగిశెట్టి రత్తయ్య, సర్పంచ్‌లు నరసింహా, నరేష్, నాయకులు ధనుంజయ్, విశ్వేశ్వరరావు, సుమన్‌రెడ్డి, చాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీరభద్రుని ఆరాధనోత్సవం



ఊయల ఊగుతున్న కల్యాణ మూర్తులైన బాలా త్రిపుర సుందరి సమేత రాజరాజ నరేంద్రస్వామి

పెదపులివర్రు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం పెదపులివర్రులో కొలువైన బాలా త్రిపుర సుందరి సమేత రాజరాజ నరేంద్రస్వామి దేవాలయంలో కొలువైన వీరభద్రుడికి మంగళవారం రాత్రి ఘనంగా ఆరాధన నిర్వహించారు. కల్యాణ మూర్తులైన స్వామివార్లను పల్లకిలో ఊరేగింపుగా వీరభద్రుని ఆలయానికి తీసుకుని వెళ్లి అనంతరం భక్తులచే పవలింపు సేవ అత్యంతవైభవంగా జరిపారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు ఆమంచి సృజన్ కుమార్ వీరభద్రుని వాక్కును ఉద్వేగభరితంగా భక్తులకు వినిపించారు. అర్చకులకు వీరభద్రుడు ఆవహించడంతో భక్తులు తన్మయత్వానికి లోనయ్యారు. ఈ సన్నివేశాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. దేవస్థాన కమిటీ చైర్మన్ జంపని అంజయ్య, కార్యనిర్వాహణాధికారి మేకా సాంబశివరావులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

రేపు ఏపీ మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని రాక

రేపల్లె: వడ్డీవారిపాలెం గ్రామంలోని శ్రీమతి సావిత్రి గణేషన్ జడ్పీహైస్కూలుకు ఈ నెల 15వతేదీ శుక్రవారం ఏపీ మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు, సెక్రటరీ బాలగంగాధర్ తిలక్‌లు విచ్చేస్తున్నట్లు పాఠశాల హెచ్ఎం బి.మాధవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సావిత్రి జయంతోత్సవాలలో భాగంగా శ్రీనివాసరావు వస్తున్నట్లు చెప్పారు. వేడుకల్లో పాఠశాలలో 1974–75 సంవత్సరంలో విద్యాభ్యాసం చేసిన పాఠశాల పూర్వవిద్యార్థులు, మహానటి సావిత్రి కళాపీఠం నిర్వాహకులు బడే ప్రభాకర్, హైకోర్టు న్యాయవాది చెంచునాయుడు, తిరుపతి వెంకయ్య, తదితరులు హాజరుకానున్నట్లు చెప్పారు.

ముగిసిన కార్తిక మాసం పూజలు

పోలికి వీడ్కోలు పలికిన భక్తులు



పేటేరులో కొలనులో దీపాలు వదులుతున్న మహిళలు, యువతులు

భట్టిప్రోలు: కార్తిక మాసం ఆఖరి రోజు బుధవారం భక్తులు పోలిని నీటిలో వదిలి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజామునే పుణ్య స్నానాలు ఆచరించి దైవదర్శనం చేసుకున్నారు. అరటి బొత్తలపై ఆవు నెయ్యితో గుబ్బవత్తులు చేసి వాటిని వెలిగించి కాల్వలలో వదిలారు. ఈ కార్తిక మాసం నెల రోజులు భక్తులు ప్రతి నిత్యం శివాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించి శివానుగ్రహం పొందారు. పలువురు నియమ నిష్టలతో పూజలు ఆచరించి తమ భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. కార్తిక మాసంలో ఏ రోజు దీపాన్ని వెలిగించక పోయినా ఈ రోజు 30 వత్తులతో దీపం వెలిగించి నీటి ప్రవాహంలో వదిలితే ఆ మాసమంతా దీపారాధన చేసిన పుణ్యం వస్తుందని పురాణ కథనం.

ఆలయంలో ప్రత్యేక పూజలు..

బాపట్ల అర్బన్: బాపట్ల ఎస్ఎన్‌పి అగ్రహారం గంగా పర్వతవర్ధనీ సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయంలో బుధవారం కార్తిక మాస అంత్య ప్రాతఃకాల నిత్య విశేష అభిషేకం అనంతరం ఆలయ అర్చకులు కొల్లిపర వెంకట శివ వర ప్రసాద్ మరకతమణి భూషణుడిగా రామలింగేశ్వర స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు గూడూరు చిట్టి బాబు, పంగులూరి కొండిన్య, నెమలికంటి హనుమంతరావు, ఆలయ ధర్మకర్త ఆదూరి హరినారాయణ పాల్గొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



భట్టిప్రోలులో పోలిని నీటిలో వదిలిన దృశ్యం

వైభవంగా పోలిస్వర్గం వేడుకలు..

రేపల్లె రూరల్: కార్తికమాసం ముగిసిన అనంతరం పాడ్యమి రోజు నిర్వహించే పోలిస్వర్గం వేడుకలను పట్టణ, మండలంలో బుధవారం వైభవంగా నిర్వహించారు. శివ కేశవులకు ప్రీతిప్రాతమైన కార్తిక మాసంలో నెలరోజుల పాటు భక్తులు వేకువజామునే పుణ్యస్నానమాచరించి ఆలయాలలో, గృహాలలో కార్తిక దీపాలు వెలిగించి పూజలు నిర్వహిస్తుంటారు. కార్తికమాసం అనంతరం భక్తులు పాడ్యమి రోజు వేకువజామునే నదులు, కొలనుల వద్దకు చేరుకుని అరటి మట్టలలో గుబ్బ ఒత్తులతో దీపారాధన చేసి పువ్వులు సమర్పించి ఆ దీపారాధనను పోలమ్మగా భావించి నీటిలో వదలటం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో మండలంలోని, పట్టణంలో నదులు, కొలనుల వద్దకు చేరుకుని భక్తులు దీపాలు వదిలారు. దీంతో ఆయా ప్రాంతాలలో పండుగ వాతావరణం నెలకొంది.



స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

ఆస్తి వివాదంలో వ్యక్తి ఆత్మహత్య

తాడేపల్లిరూరల్: ఆస్తి వివాదంతో మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. మంగళగిరి రూరల్ ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాలు.. చినకాకానిలో నివాసముండే జె.స్వామి(48)కి అతడికి పెద్దల నుంచి వచ్చిన పంట భూమి ఉంది. ఆ పంట భూమిలో వ్యవసాయం చేసుకుంటూ తన భార్య సుజాత, ముగ్గురు కుమార్తెలు, కొడుకును పోషించుకుంటూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో స్వామి బంధువులు ఆ పొలంలో తమకు కూడా వాటా ఉందంటూ హైకోర్టు నుంచి నోటీసులు పంపించారు. రెండు రోజుల నుంచి మానసికంగా ఆందోళన చెందుతున్నాడు. బుధవారం ఇంట్లోని రాడ్‌కు తాడుతో ఉరి వేసుకుని మృతిచెందాడు. ఘటనపై స్వామి కుమారుడు నరసింహనాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అక్రమ మద్యం కలిగిఉన్న వ్యక్తి అరెస్ట్

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్రమ మద్యం కలిగి ఉన్న ఓ వ్యక్తిని బుధవారం తాడేపల్లి పోలీసులు అదుపులోకి తీసుకుని కోర్టుకు హాజరు పరిచారు. ఎస్ఐ గిరిబాబు తెలిపిన వివరాలు.. ప్రకారం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా చిర్రావూరుకు చెందిన టంకశాల శ్రీనివాసరావు తన బడ్డీ కొట్లో మద్యం నిల్వలు ఉంచి విక్రయిస్తున్నాడని సమాచారం రావడంతో తనిఖీ చేశామని, ఈ తనిఖీల్లో శ్రీనివాసరావు బడ్డీ కొట్లో 40 క్వార్టర్ బాటిళ్లు లభ్యం కావడంతో అతనిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు ఎస్ఐ వివరించారు.

మానవ రవాణాపై అవగాహన

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల డాక్టర్ కేఆర్‌ఆర్‌ఎం డిగ్రీ కళాశాలలో మానవ అక్రమ రవాణాపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ కె.బలరామకృష్ణ మాట్లాడుతూ మనుషుల అక్రమ రవాణా అనేది ప్రపంచంలోనే అతిపెద్ద నేరంగా ఉందని చెప్పారు. ముఖ్యంగా ఉద్యోగం, సినిమా అవకాశాల ద్వారా మోసం చేసి విదేశాలకు అమ్ముతున్నారని, ప్రతి విద్యార్థిని తమ పరిధిలో ఉన్న వారికి అవగాహన కల్పించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.గిరిధర్ రావు మాట్లాడుతూ ప్రస్తుతం యువత మొబైల్, ఇంటర్‌నెట్ ద్వారా సైబర్ ట్రాపింగ్‌కు గురి అవుతున్నారని పేర్కొన్నారు. అనుమానాస్పద వ్యక్తుల నుంచి మెసేజ్‌లు,, కాల్స్ గానీ వచ్చినప్పుడు జాగ్రత్తలు వహించాలని వివరించారు. కార్యక్రమంలో ప్రజ్వల అసిస్టెంట్ కో ఆర్డినేటర్ అనీల్ కుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు

తెనాలిరూరల్: తెనాలి మండలం పెదరావూరులోని అభయహస్త సుబ్రహ్మణ్య స్వామి దేవస్థాన తృతీయ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి జరుగనున్నాయి. తొలిరోజు తిరుమంజన సేవ, 15వ తేదీన చండీ హోమం, సువాసినీ పూజ, 16 అవహంతి హోమం, 17 సుబ్రహ్మణ్య స్వామి రథోత్సవం, 18వ తేదీన శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి వారి కల్యాణం జరుగుతాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని యర్రబాలెంలో మద్యానికి బానిసైన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన ఘటనపై బుధవారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాలు.. యర్రబాలెంలో నివాసముండే మస్తాన్(లేటు), ఫాతిమా కుమారుడైన నాగుల్ మీరా(33) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. మద్యానికి బానిస కావడంతో భార్య విడాకులు ఇచ్చి వెళ్లిపోవడంతో తల్లి దగ్గరే జీవిస్తున్నాడు. తల్లి మంగళవారం మద్యానికి నగదు ఇవ్వకపోవడంతో పలుమార్లు తల్లితో గొడవపడ్డాడు. తెల్లవారుజామున మద్యానికి డబ్బులు ఇవ్వలేదని మనస్తాపంతో ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెందాడు. ఘటనపై తల్లి ఫాతిమా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

తెనాలిఅర్బన్: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు ఎస్.రవీంద్రారెడ్డి డిమాండ్ చేశారు. నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం తెనాలి ఆర్టీసీ డిపో ఆవరణలో కొద్దిసేపు ఆందోళన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు సీపీఎస్, జీపీఎస్ రెండు ఆప్షన్‌లు ఎంచుకునే వెసులుబాటు ప్రభుత్వం కల్పించాలని కోరారు. అలాగే అన్ని కేటగిరీల వారికి ప్రమోషన్‌లు ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అన్ని బిల్లులను ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేశారు. నాయకులు ఎన్.సుధాకర్, గురవారెడ్డి, ఇ.ప్రేమ్ కుమార్, నరసింహరావు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన పంటల పరిశీలన



బేతపూడిలో తడిచిన పంటను పరిశీలిస్తున్న ఏఓ వాగోలు బుష్

రేపల్లె: మిచాంగ్ తుఫానుతో పంట నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వ ఆదేశాలతో అంచనాలు తయారుచేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి వాగోలు బుష్ చెప్పారు. మండలంలోని పలు గ్రామాలలో జరుగుతున్న పంట నష్టపరిహారం అంచనాల తయారీని బుధవారం పరిశీలించి మాట్లాడారు. మంగళవారం నుంచి ఈ నెల 18వతేదీ వరకు పంటలను పరిశీలించి అంచనాలు తయారుచేయటం జరుగుతుందన్నారు. తయారు చేసిన అంచనాలను 19, 20తేదీలలో ఆయా గ్రామాలలోని రైతుభరోసా కేంద్రాలలో నివేదికను అందుబాటులో ఉంచుతామన్నారు. గ్రామాలలోని రైతులు వ్యవసాయ అధికారులకు సహకరించి పంట నష్టపరిహార వివరాలు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

వేమూరులో...

చావలి(వేమూరు): తుఫాన్ వల్ల పంట నష్టపోయిన రైతులను గుర్తించి నష్టం అంచనా వేయడం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి సునీత తెలిపారు. వేమూరు మండలంలోని చావలి గ్రామంలో నీట మునిగి పోయిన పంట పొలాలను ఆమె పరిశీలించారు. రైతులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి

డీపీఓ డి.రాంబాబు



మాట్లాడుతున్న డీపీఓ రాంబాబు

కర్లపాలెం: మండలంలో అభివృద్ధి పనులకు అధికారులు ప్రజా ప్రతినిధులు కలసి సమన్వయంతో పనిచేయాలని డీపీఓ, కర్లపాలెం ఎంపీడీఓ దాసరి రాంబాబు చెప్పారు. ఎంపీపీ యారం వనజ అధ్యక్షతన బుధవారం మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అధికారులు వారి శాఖల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు వివరించారు. ఈ సమావేశంలో పెదపులుగువారిపాలెం సర్పంచ్ అక్కల శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ద్వారా తుఫాన్ ప్రభావిత ప్రాంతాలలో పశువులకు ఉచితంగా ఇస్తున్న సమీకృత దాణా తీర ప్రాంత గ్రామాలైన తుమ్మలపల్లి, నర్రావారిపాలెం, కట్టావాడ, పెదపులుగువారిపాలెం గ్రామాలకు కూడా ఇవ్వాలని కోరారు. తుమ్మలపల్లి సర్పంచ్ తమ గ్రామంలోని విద్యుత్ సమస్యలను పరిష్కరించాలన్నారు. వైఎస్ ఎంపీపీ పందరబోయిన సుబ్బారావు మాట్లాడుతూ రక్షిత మంచినీటి పథకం ఫిల్టర్ బెడ్ మరమ్మతులకు జనరల్ ఫండ్ నుంచి రూ.లక్ష మంజూరు చేసి చాలా రోజులైనా వర్క్ ఆర్డర్ ఇవ్వటం లేదని మండిపడ్డారు. నల్లమోతువారిపాలెం ఎంపీటీసీ సభ్యుడు తాండ్ర సాంబశివరావు మాట్లాడుతూ తుఫాన్ వచ్చి రైతులు కష్టాలలో ఉంటే సర్వసభ్య సమావేశానికి కొందరు అధికారులు రాకపోవటం విచారకరమన్నారు. ఎంపీటీసీ సభ్యులందరూ అభివృద్ధి పనుల కోసం ఎంపీపీ యారం వనజకు సహకరించాలని సాంబశివరావు కోరారు. తహసీల్దార్ కేశవ నారాయణరావు, ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, వైస్ ఎంపీపీ కాగిత బుల్లియ్య, ఈఓపీఆర్డీ ఎలీషాబాబు, సీడీపీఓ శైలజ, పలువురు అధికారులు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సామూహిక కుంకుమార్చన



భట్టిప్రోలులో నిర్వహించిన సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

భట్టిప్రోలు: భట్టిప్రోలు రథం సెంటర్‌లో కొలువైన రుక్మిణి సత్యభామ సమేత వేణు గోపాలస్వామి ఆలయంలో కొలువైన రాజ్యలక్ష్మి అమ్మవారి సన్నిధిలో 65వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. కుంకుమార్చనలో 40 మంది మహిళలు పాల్గొన్నారు. మార్గశిర మాస పాడ్యమి పర్వదినాన 1958లో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. నాటి నుంచి క్రమం తప్పకుండా ఈ కార్యక్రమాన్ని జరుపుతూ వస్తున్నారు. విగ్రహాన్ని దివంగత మానేపల్లి లక్ష్మయ్య సమర్పించారు. కార్యక్రమ నిర్వాహణకు మానేపల్లి లింగయ్య కుటుంబ సభ్యులు పూజా ద్రవ్యాలు సమర్పించారు. అమ్మవారిని ప్రతిష్ఠించిన దాతలైన దివంగత పులికొండ రాధా కృష్ణ దంపతులు నాటి నుంచి అమ్మవారికి వార్షికంగా శరన్నవ రాత్రులు, శ్రావణమాస పూజలు, అమ్మవారికి అన్ని రకాల కైంకర్యములను నిర్వహిస్తున్నారు. టీటీడీ మండల ధర్మాచారి బుర్లె అరుణ కుమారి సహస్ర కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు మానేపల్లి ఉమామహేశ్వరి, కోట యశోదాదేవి, కొల్లూరు అనూష, మానేపల్లి శైలజ కుమారి, పులికొండ దేవసేన ఆండాళ్, దేవాలయ అర్చకుడు అగ్నిహోత్రం నరసింహాచార్యులు చావలి రాంబాబు పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యనిర్వాహణాధికారి దీవి వేంకట అప్పలాచార్యులకు భజన మండలి కృతజ్ఞతలు తెలిపింది.

భక్తిశ్రద్ధలతో పోలిస్వర్గం పూజలు

తెనాలిరూరల్: కార్తిక మాసం చివరి రోజు సందర్భంగా తెనాలి మండలం సంగంజాగర్లమూడి గ్రామంలోని సంగమేశ్వరస్వామి దేవస్థానంలో పోలిస్వర్గం పూజ కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సతీమణి పుష్ప అమ్మవారిని దర్శించుకుని, పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తెనాలి మార్కెట్ యార్డు డైరెక్టర్ రావి ప్రశాంతి, రాంబాబు దంపతుల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ఈఓ పద్మ, అర్చకుడు కాశీ ప్రసాద్, ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ఉజ్వాల్ యోజనతో మహిళలకు మేలు

ఫిరంగిపురం: ప్రధానమంత్రి ఉజ్వల్ యోజనతో మహిళలకు ఎంతో మేలు చేకూరుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు జూపూడి రంగరాజు అన్నారు. మండలంలోని గుండాలపాడు, బేతపూడి గ్రామాల్లో బుధవారం వికసిత భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం నిర్వహించారు. పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మహిళలకు నేతలు కోరారు. కార్యక్రమంలో బీజేపీ కార్యవర్గ సభ్యురాలు శనక్కాయల అరుణ, సుబ్బారావు, కె.బ్రహ్మయ్య, ఎం.హనుమంతరావు, ఆర్.నారాయణ, ఈఓపీఆర్డీ నిర్మలలక్ష్మీ కుమారి పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ బలోపేతానికి కృషి చేయాలి

తాడేపల్లిరూరల్: ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీలను సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు కృషి చేయాలని ఎమ్మార్పీఎస్ గుంటూరు జిల్లా ఇన్‌చార్జి మందా వెంకటేశ్వరరావు మాదిగ అన్నారు. బుధవారం మంగళగిరి పట్టణ పరిధిలోని ఐబీఎస్ భవన్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎంఆర్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో వచ్చే ఏడాది ఫ్రిబవరిలో విజయవాడ నగరంలో బహిరంగ సభను నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఈనెల 15వ తేదీన గుంటూరు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించి జిల్లా కమిటీని ఎన్నుకోవడం జరుగుతుందని అన్నారు. సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి చందోలు విక్టర్ పాల్, ప్రధాన కార్యదర్శి రామారావు మాట్లాడారు.

దళితుడిపై దాడి చేసిన వ్యక్తుల అరెస్టు

అమర్తలూరు(వేమూరు): అమర్తలూరు మండలంలోని మూల్పూరు గ్రామానికి చెందిన ఐమల ప్రమోద్ కుమార్‌పై దాడి చేసిన అగ్రకులాలకు చెందిన ఘంటా సాయి, ఆవుల సుబ్బారావు, ఆవుల గోపి, సురేష్‌లను అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరచడం జరిగిందని రేపల్లె డీఎస్పీ తుపాకుల మురళీ కృష్ణా చెప్పారు. ఈ నెల 8వ తేదీన ఘంటా సాయి, ఆవుల సుబ్బారావు, ఆవుల గోపి, సురేష్‌లు, అదే గ్రామానికి చెందిన దళిత వర్గానికి చెందిన ప్రమోద్ కుమార్‌ను కులం పేరుతో దూషించి ఇష్టారాజ్యంగా కొట్టారు. ప్రమోద్ కుమార్ ఫిర్యాదు మేరకు నిందితులపై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదు చేశారు. నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచామని డీఎస్పీ తెలిపారు.